# కొత్తకథ

**తెలుగు సినిమా నిర్మాతలు, దర్శకులు, రచయితలు, ఇంకా నకల రంగాల కళాకారులు ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని చూపించాలని తెగ తాపత్రయపడిపోతుంటారు. వారు తాపత్రయపడే విధంబెట్టిదనిన...**

అదో విశాలమైన ఏ.సి గది. అందులో ఒక సోఫాలో కూర్చుని ఉన్నాడు నిర్మాత. ఇద్దరు కూర్చోవలసిన సోఫా ఆయన కొక్కడికే బొటాబొటిగా సరిపోయింది.

ఆయనకు కుడి పక్కన కూర్చున్నాడు డైరెక్టర్. బెత్తెడంచు జరీ పంచె, నలిగిన ఖద్దరు షర్టు, ముఖాన వెడల్పాటి విభూతి పట్టీలు. వాటి మధ్యన అర్ధరూపాయి సైజులో గంధం బొట్టు, దానిపై పావలాకాసంత కుంకుమ బొట్టు. పది వేళ్ళకూ రకరకాల రాళ్ళు పొదిగిన ఉంగరాలు. మెళ్ళో గుప్పెడు తాయెత్తులు ఉన్నాయి. ఆయన ముఖం గంభీరంగా ఉంది.

ఆయన పక్కన ఆసీనుడై ఉన్నాడు మాటల రచయిత. వంగపండు రంగు పట్టు లాల్చీ, పైజామా ధరించి, మెళ్ళోనూ, చేతులకూ జెర్రిపోతుల్లాంటి బంగారం గొలుసులు తగిలించుకున్నాడు. శూన్యం లోకి చూస్తూ గుప్పుగుప్పున సిగరెట్ పొగ వదులుతున్నాడు.

జీన్సు ప్యాంటు మీద టీషర్టు వేసుకున్న అసిస్టెంట్ డైరెక్టర్ మదన్ ఓ చోట కూర్చోకుండా గదంతా కాలు కాలిన పిల్లిలా పచార్లు చేస్తున్నాడు. అతనికి పాతికేళ్ళు. డైరెక్టర్‌కు అన్న కొడుకు. 'బాబాయి దగ్గరుండి పని నేర్చుకో' అని పంపించాడు అతని తండ్రి. మదన్‌కు మా చెడ్డ ఎగ్జయిటింగ్‌గా ఉంది.

వారంతా ఒక ప్రముఖ సంస్థకు చెందినవారు. వారి సంస్థ ఎన్నో హిట్ చిత్రాలూ, సూపర్ హిట్ చిత్రాలూ నిర్మించింది. ప్రస్తుతం మరో చిత్రం నిర్మించే ప్రయత్నంలో ఉన్నారు. ప్రముఖ హీరోనీ, దర్శకుడినీ, సంగీత దర్శకుడినీ, కెమేరామేన్‌ని, డైలాగ్ రైటర్నీ ఫిక్స్ చేసి కథ కోసం వెతకులాట మొదలుపెట్టారు.

మరీ శ్రీ మొదలు శ్రీపాదం వరకు మూసపోసిన పాత చింతకాయ పచ్చడి కథ కాకుండా మాంచి వెరైటీ కథతో పిక్చర్ తీయాలనే సదుద్దేశంతో విసుగూ విరామం లేకుండా పొద్దునా, మధ్యాహ్నం, సాయంత్రం అదే పనిగా కూర్చుని స్టోరీలు వింటున్నారు. అయినా, ఎక్కడా మంచి కథ దొరకలేదు. అవతల సమయం ముంచుకొస్తోంది. కాలదోషం పట్టకుండా కథ వెతుక్కుని పని ప్రారంభించాలి.

అంతా టెన్షన్‌లో ఉన్నారు. ఎవరో శ్రేయోభిలాషి ఓ కొత్త రచయితను గురించి చెప్పాడు. అతను పరిశ్రమకు కొత్తవాడు. కాబట్టి ఆలోచనావిధానం కూడా కొత్తగానే ఉంటుందనే ఆశాభావంతో అతని కోసం ఎదురు చూస్తున్నారు.

నిర్ణీత సమయానికే వచ్చాడు రచయిత. జీన్సు ప్యాంటు మీద లాల్చీ వేసుకున్నాడు. చేతిలో ఫైలు. అందరికీ నమస్కారాలు చేశాడు. పరిచయాలూ, కాఫీలు అయ్యాయి.

"ఇక ప్రారంభిద్దామా" అన్నాడు డైరెక్టర్. టేప్ రికార్డర్ ఆన్ చేసి రచయితగారికి దగ్గరగా ఉంచాడు మదన్. అందరూ కథ వినడానికి సిద్ధమైపోయారు.

కళ్ళు మూసుకుని ఓ నిమిషం దేవుడిని ప్రార్థించుకుని, కళ్ళు తెరిచి కుడి చెయ్యి పైకి లేపి గాల్లో చిటికె వేసి కథ మొదలు పెట్టాడు రచయిత.

"మొదటి సీన్లో ఓ బూటుకాలు. ఆ బూటుకాలికి ఇంపోర్టెడ్ జీన్సు, ఆ కాలు ఒక్క కిక్‌తో మోటార్ సైకిల్ స్టార్ట్ చేస్తుంది. అంతే చూపిస్తాం. ముఖం కనిపించదు. తరువాతి సీన్లో తెల్ల పంచె, తెల్ల షర్టు, వజ్రాల ఉంగరం ధరించిన ఓ చెయ్యి రెండు అంచుల జరీ కండువాను భుజం మీదికి విసురుకుంటుంది. ఇక్కడా ముఖం కనిపించదు."

వింటున్న దర్శకుడు నీరుకారిపోయాడు. "హతోస్మి! మళ్ళీ జరీ కండువా భుజం మీదికి విసురుకునే క్యారక్టరా! ఇలాంటి పాత్రలు చాలా వచ్చాయిగా." విసుక్కున్నాడు.

మళ్ళీ చెయ్యెత్తి గాల్లో చిటికె వేశాడు రచయిత. "అదే మరి. మీరనుకున్నట్లే ప్రేక్షకులూ అనుకుంటారు. అసలు విషయం వినండి మరి. హీరో ద్విపాత్రాభినయం. తండ్రీ కొడుకూ. మళ్ళీ ఇక్కడో మలుపుంది. జీన్సు ప్యాంట్ కాలు కొడుకుదీ, జరీ కండువా చెయ్యి తండ్రిదీ అనుకుంటారు అందరూ. నిజానికి జీన్సు ప్యాంటు కాలువాడు తండ్రి. కండువా వాడు కొడుకు."

దర్శకుని ముఖం వికసించింది. కథలో కొత్తదనం ఉన్నట్లే ఉంది. నిర్మాత వైపు చూశాడు. "వింటున్నారా హీరో డబుల్ రోల్‌ట" అన్నాడు కాస్త అనుమానంగా. కుడి చెయ్యి చూపించి అభయం ఇచ్చాడు నిర్మాత. ఆ వెంటనే ఆయన కుడి కన్ను టిక్కుటిక్కుమని అదిరింది. దాంతో ఆయన ముఖం వికసించింది. వారిద్దరి ముఖాల్లో వికాసం గమనించి ఉత్సాహంగా కథ మొదలుపెట్టాడు రచయిత.

"మన కథలో హీరోలు ఒక సస్యశ్యామలమైన పల్లెటూర్లో గొప్ప భూస్వాములు. పెద్ద హీరో భార్య చిన్న హీరో పుట్టగానే చచ్చిపోతుంది. చిన్న హీరో తాతగారి అదుపాజ్ఞలలో పెరిగి పెద్దవాడై ఆయన లక్షణాలన్నీ పుణికిపుచ్చుకుని, ఆయన మరణానంతరం ఊరికి పెద్దగా వ్యవహరిస్తున్నాడు. ఇదంతా దండ వేసిన తాతగారి ఫోటో ముందు నిలబెట్టి చిన్న హీరో చేత చెప్పిస్తాం.

పోతే, పెద్ద హీరో మహా రసికుడు. తండ్రి పోయేదాకా ఆయనకు భయపడి, ఆయన పోగానే జాలీగా, హాయిగా జీవితం గడుపుతూ ఉంటాడు. వయసు మీద పడినా పిటపిటలాడుతూ మోటార్ సైకిల్ మీద రోడ్ల వెంబడి తిరుగుతూ ఉంటాడు. అతనిని చూసి ఊళ్ళోని ఆడాళ్ళంతా వయోభేదం లేకుండా వెర్రెత్తి మతులు పోగొట్టుకుంటూ ఉంటారు. అతనిని అంత దూరాన చూడగానే చీరలూ, ఓణీలూ గాల్లోకి వదిలేసి అతని వెంట పరిగెడతారు. అతను కూడా వాళ్ళతో సరసాలాడుతూ పైలాపచ్చీసుగా ఉంటాడు.

> అందరూ కథ వినడానికి సిద్ధమైపోయారు. ఓ నిమిషం దేవుడిని ప్రార్థించుకుని, కుడి చెయ్యి పైకి లేపి గాల్లో చిటికె వేసి కథ మొదలు పెట్టాడు రచయిత.

చిన్న హీరో కూడా మన్మథుడే. కానీ, కండువా భుజం మీద వేసుకుని రచ్చబండ వ్యవహారాలూ, పొలం పనులూ చూసుకుంటూ గంభీరంగా ఉండడం వల్ల ఆడపిల్లలంతా మనసులు పారేసుకున్నా, బట్టలు మాత్రం గాల్లోకి వదిలెయ్యరు. ఇంట్లోనే చాటుమాటుగా మంచాల మీద దొర్లుతూ అతనితో పెళ్ళయినట్లు కలలు కంటూ ఉంటారు. అలా కలలు కనేవారికి అగ్రస్థానం వహించిన పిల్ల మన సెకండ్ హీరోయిన్." చెబుతూ కాసేపు ఆపాడు రచయిత.

"సెకండ్ హీరోయిన్ ఉందా, గుడ్. మరి ఫస్ట్ హీరోయిన్ ఏదీ? తండ్రి సంగతేమిటి? అతగాడికి ఆడ తోడు లేదా?" కుతూహలంతో అడిగాడు దర్శకుడు.

"అందరూ ఉన్నారు. అడుగడుగునా కథా వైవిధ్యంతో ప్రేక్షకులను తికమక పెడుతూనే ఉంటాం. అసలు హీరోయిన్ ఆనక నెమ్మదిగా వస్తుంది. ప్రస్తుతం సెకండ్ హీరోయిన్ గురించి చెప్పుకుంటున్నాం కదా. ఆవిడ ఫారెన్లో చదువు ముగించి పల్లెకి వచ్చింది. ఆవిడ తండ్రి శ్రీమంతుడు. ఆయనకు బంగారం గని ఉంది. ఆయనే మన కథలో విలన్. ఆయనది వీళ్ళ పక్క ఊరు."

"బంగారం గనా? బావుంది. ఇంతకాలం స్మగ్లింగూ, కట్టెల అడితిలూ ఉన్న విలన్లే. ఇదో వెరైటీగా ఉంటుంది." ఆనందపడ్డాడు నిర్మాత.

"అప్పుడే ఏం చూశారూ! మన కథంతా కొత్తదనమే. సరే ఆయనకు బంగారం గని ఉందని చెప్పుకున్నాం కదా! తన ఏకైక పుత్రికని మరో బొగ్గుగని ఓనరు కొడుక్కి ఇచ్చి పెళ్ళి చెయ్యాలని నిర్ణయించి వాళ్ళకు మాట ఇచ్చేస్తాడు.

కానీ, సెకండ్ హీరోయిన్ చిన్న హీరోకి మనసిచ్చేస్తుంది. అతని వెంటబడి అతను చేలగట్ల మీద వెళుతుంటే వెనక నుంచి వెళ్ళి ఎగిరి అతని వీపు మీద కూర్చుంటుంది. చేనుకి కాపలాగా పడుకుంటే, అతని పక్కలో దూరి అతణ్ణి మీదికి లాక్కుని ముద్దులివ్వమని పీక్కుతింటుంది.

కానీ, హీరోకి మాత్రం ఆవిడని చూస్తే ఒళ్ళు మంట. కంపరం. ఆ రెండు కుటుంబాల మధ్యా రెండు తరాల నుండీ బద్ధవైరం. రెండు తరాల కిందట ఆ ఇంటావిడా, ఈ ఇంటావిడా సంక్రాంతి నాడు రథం ముగ్గు వేసి తాడువేసుకుంటూ ఊరి పొలిమేర దాకా వెళ్ళి అక్కడ ఢీకొన్నారు. 'నేను ఇంకాస్త దూరం తాడు వేసుకోవాలి నువ్వు తప్పుకో', అంటే నువ్వు తప్పుకో' అని జుట్టూ జుట్టూ పట్టుకున్నారు. ఆ తగవు పెద్దదై ఇరువైపుల మగవారూ రంగంలో దిగారు. ఆ తర్వాత రెండు ఊళ్ళ వాళ్ళకీ తగాదాగా పరిణమించింది. దెబ్బలాడుకుని తలకాయలు పగలగొట్టుకుని సగం మంది చచ్చారు. మిగిలిన సగం మంది జైలుకెళ్ళారు. అప్పటి నుంచీ ఆ శత్రుత్వం కొనసాగుతూనే ఉంది. ఈ కథంతా చిన్న హీరో తన పాలేరుతో చెబుతాడు. ఇది ఫ్లాష్ బ్యాక్ అన్నమాట.

ఇదిలా ఉండగా, విలన్‌కి ఈ విషయం తెలుస్తుంది. తన మాట ప్రకారం బొగ్గుగని ఓనరు కొడుకును పెళ్ళి చేసుకోమని కూతురికి చెబుతాడు. కానీ, ఆ

మొండి పీనుగ వినకపోవడంతో వినుక్కుని తన గనిలో పనిచేసే వాళ్ళల్లో దున్నపోతుల్లాంటి వాళ్ళని ఎంచి చిన్న హీరోను చంపి రమ్మని పంపిస్తాడు. హీరో దున్నపోతుమీదెక్కి ఆ దున్నపోతుల్లాంటి మనుషులతో ఫైట్ చేస్తాడు." మళ్ళీ ఆపాడు రచయిత.

"దున్నపోతు మీద కూర్చుని ఫైటు వెరైటీగా ఉంటుంది. మంచి ఫైట్ మాస్టర్ని పెట్టుకుందాం" అన్నాడు దర్శకుడు. మళ్ళీ అభయహస్తం చూపించాడు నిర్మాత.

"కథలో ఫైట్లన్నీ వెరైటీగానే ఉంటాయి. తరువాతి ఫైట్ నదిలో బల్లకట్టు మీద. ఇలా తన ప్రయత్నాలు విఫలం అవడంతో పళ్ళు కొరుక్కుని సమయం కోసం కనిపెట్టుకుని ఉంటాడు విలన్" అని కథ కొనసాగించాడు రచయిత.

"ఇదిలా ఉండగా, ఫస్ట్ హీరోయిన్, ఆవిడ సవతి తల్లి - ఈవిడే మన కథలో మరో ఇంపార్టెంట్ రోల్- ఊళ్ళో దిగుతారు. దిగీ దిగగానే పొగరుబోతు ఎద్దు వాళ్ళను కుమ్మబోతుంది. పెద్ద హీరో వచ్చి రక్షించి, వాళ్ళిద్దరికీ నది ఒడ్డున పర్ణశాల లాంటి ఇంట్లో బస ఏర్పాటు చేస్తాడు.

మర్నాడు వాళ్ళను కలుసుకోవడానికి వస్తాడు చిన్న హీరో. 'పట్నంవాళ్ళు మా ఊరికి ఎందుకు వచ్చారు' అని అడుగుతాడు.

'మాదసలు ఈ ఊరే. చాలారోజుల కిందటే ఊరొదిలి వెళ్ళిపోయాం. మా అమ్మాయికి ఆరెకరాల పొలం, నాకు నాలుగెకరాల కొబ్బరి తోటా ఉంది ఇక్కడ. అటు మా అమ్మాయి చేనూ, ఇటు నా కొబ్బరి బొండాలు పట్టించుకునే వాళ్ళు లేరు కదా అని మేమే వచ్చాం' అంటుంది తల్లి."

చిత్రాలు: నర్సిం



కథ వింటున్న డైలాగ్ రైటర్ శోభనం పెళ్ళికొడుకులా సిగ్గుపడుతూ ముసిముసి నవ్వులు నవ్వుకున్నాడు. మాంచి డైలాగులు రాయడానికి బోలెడంత స్కోపు ఉందని మురిసిపోయాడు.

కథ కొనసాగించాడు రచయిత. 'మంచి పని చేశారు. మీకు నేను అండగా ఉంటాను' అని హామీ ఇచ్చాడు చిన్న హీరో. తల్లీకూతుళ్ళు నిశ్చింతగా ఆ ఊళ్ళో స్థిరపడ్డారు. ఓ రోజు చిన్న హీరోయిన్ బికినీ వేసుకుని చెర్లో దూకి ఈత కొడుతుంటే జలగలు పట్టుకుంటాయి. కుయ్యో మొర్రోమంటూ అరుస్తుంది. అటుగా వెళుతున్న పెద్ద హీరో చెర్లో దూకి చిన్న హీరోయిన్ని బయటకు లాక్కొస్తాడు. గుండె మీదొక జలగ, బొడ్డు మీద ఒక జలగ, తొడ మీద ఒక జలగ పట్టుకుంటాయి. వాటిని పీకి పారేసి అవి పట్టుకున్న చోట బాగా మర్దనా చేసి ఉపశమనం కలిగిస్తాడు. దాంతో చిన్న హీరోయిన్ గుండె ఝల్లుమంటుంది. పెద్ద హీరో వంక ఆరాధనగా చూస్తుంది.

ఇక్కడ చిన్న హీరో రోజూ పొలం వెళుతూ దార్లో పెద్ద హీరోయిన్ ఇంటికొచ్చి పలకరిస్తూ ఉంటాడు. ఆవిడ జానెడంచు పట్టు చీర కట్టుకుని, జారుముడి వేసుకుని, తులసి పూజలు చేస్తూ ఉండడంతో ఆవిడ పట్ల ఆకర్షితుడవుతాడు చిన్న హీరో."

కథ వింటున్న మదన్‌కి చిరాకేసింది. "ఏవిటిది? అంతా అస్తవ్యస్తంగా ఉందే" అన్నాడు.

"ఏ పుట్టలో ఏముందో ఎవరికి తెలుసు? ఈ కథలో ఏం అంతరార్థం ఉందో మరి. పూర్తిగా విననీ" అన్నాడు దర్శకుడు.

మళ్ళీ కథ మొదలయింది. "పెద్ద హీరోయిన్ కూడా చిన్న హీరో పట్ల ఆకర్షితురాలవుతుంది. ఒక రోజు ఏడుస్తూ తన కథ చెపుతుంది. తనెంతో ప్రేమించే అక్కకి పెళ్ళవుతుంది. ఒక కూతుర్ని కని పురిట్లోనే కన్ను మూస్తుంది అక్క. అక్క మీది అభిమానంతో ఆ పురిటికందుని అనాథను చెయ్యడం ఇష్టంలేక బావతో పెళ్ళికి అంగీకరిస్తుంది. పెళ్ళిలో అరుంధతీ నక్షత్రం చూసి లోపలికొస్తూ పంచె కాలికి అడ్డంపడి మూరెడెత్తు గడప మీద వెల్లకిలా పడిపోతాడు బావ. దాంతో వెన్నెముకకి దెబ్బ తగిలి సంసార జీవితానికి పనికిరాకుండా పోతాడు. ఆ దెబ్బకి జీవితం మీద విరక్తి చెంది, ఉత్తరం రాసిపెట్టి సన్యాసుల్లో కలిసిపోతాడు. తన గతాన్ని చెప్పి 'ఇది నా కథ. పెళ్ళి అయిన కన్యను. తల్లిని కాని తల్లిని' అని ఏడుస్తుంది. చిన్న హీరో మనసు కరిగిపోతుంది. నేను నిన్ను పెళ్ళి చేసుకుంటానని మాట ఇస్తాడు.

అదే సమయంలో చిన్న హీరోయిన్‌ని పెళ్ళి చేసుకుంటానని మాట ఇస్తాడు పెద్ద హీరో. ఈ విషయం కొడుకుతో ఎలా చెప్పాలా అని తండ్రీ, తండ్రితో ఎలా చెప్పాలా అని కొడుకూ పాట రూపంలో తర్జనభర్జన పడతారు. చివరికెలాగైతేనేం చెప్పేసుకుని ఒకరి నిర్ణయాన్ని మరొకరు గౌరవిస్తారు. ఈ విషయం తెలిసి ఊరి జనం గగ్గోలు పెడతారు."

మదన్ కుర్చీలోంచి లేచాడు. "వింటున్న జనమే కాదు, సినిమా చూస్తున్న జనం కూడా గగ్గోలు పెడతారు. ఇదేం కథ. బొత్తిగా వావీవరసలూ ఉండక్కర్లేదా" అంటూ ధ్వజమెత్తాడు.

"వెరైటీ కావాలి, వెరైటీ కావాలి అంటారు. కాస్త వెరైటీ చూపిస్తే ఇదుగో ఇలా విరుచుకు పడతారు" అని వినుక్కున్నాడు రచయిత.

"వెరైటీగా ఉంటుందని మగాడు పిల్లల్ని కంటున్నట్లు చూపిస్తే చెప్పులు విసురుతారు" అన్నాడు మదన్

దర్శకుడు కల్పించుకున్నాడు. "నువ్వాగరా అబ్బాయ్. ఓ రకంగా చూస్తే ఈ కథ బానే ఉంది. పెళ్ళిలో ఓ పాట పెడదాం. 'తండ్రే కొడుకుకి అల్లుడయ్యేడూ. అల్లుడైన తండ్రికి కాళ్ళు కడిగి కన్యాదానం చేసేడూ' అని ఒక చరణం!

'అవనిలో జరగని వింత ఇది! ఆనాడు త్యాగం చేసిన తల్లికి కూతురే అత్తగారై తల్లిగా ఆదరిస్తుందీ' అని ఒక చరణం రాయించి, హృద్యంగా కంపోజ్ చేయించి, తండ్రి పెళ్ళిలో ఆ చరణం, కొడుకు పెళ్ళిలో రెండో చరణం పిక్చరైజ్ చేశామంటే అదిరి పోతుంది. జనం నోరావలించుకుని చూస్తారు" అంటూ సర్ది చెప్పాడు.

"అంతగా అయితే ఓ వారం కలెక్షన్లు చూసి, ప్రేమ మనసుకి సంబంధించినదా లేక వయసుకా అని ఓ పోటీ పెడదాం. నాలుగు బహుమతులు ప్రకటించామంటే నాలుగాటలూ విరగబడి చూస్తారు." మరో ఉపాయం కూడా సూచించాడు నిర్మాత.

ఎలాగూ అంతరాయం కలిగింది కాబట్టి మరొక సారి కాఫీలు తాగి మళ్ళీ కథ మీద కూర్చున్నారు.

"గగ్గోలు పెట్టిన జనాల లోకి వచ్చి, ప్రేమ మనసుకే గానీ వయసుకి కాదని, మనుషుల మధ్య అనుబంధం ఏర్పడితే వావి వరసలు అడ్డు రావని మాట్లాడి వాళ్ళ కళ్ళు తెరిపిస్తారు తండ్రీ కొడుకులు.

ఆ రెండు జంటలకీ పెళ్ళిళ్ళు జరుగుతాయి. చిన్న హీరోయిన్‌ని తీసుకొని పెద్ద హీరో అమెరికా వెళ్ళిపోతాడు. అక్కడ ఆడుతూ పాడుతూ ఆనందంగా ఉంటారు."

"ఇది బావుందయ్యా. మనం నిరభ్యంతరంగా ఫారెన్లో పాటలు తీసుకోవచ్చు. 'ఊఁ అంటే ఫారెను పోతారు పాటల కోసం. కథకీ, పాటలకీ బొత్తిగా పొంతన ఉండడం లేదు' అని ఒహటే ఆడిపోసుకుంటున్నారు క్రిటిక్స్. ఈ దెబ్బతో వాళ్ళ నోళ్ళు మూతపడతాయి. చిన్న హీరో డ్యూయెట్లూ అక్కడే తియ్యొచ్చు. తండ్రి దగ్గరికి చుట్టపు చూపుగా వెళ్ళాడు కొడుకు. అక్కడో పాట పాడుకున్నాడు. ఇందులో తప్పేముంది" అంటూ ఆనందపడి

పోయాడు దర్శకుడు.

"మరి వీసాలూ అవీ" అంటూ నిర్మాత వైపు చూశాడు. కుడి చెయ్యి ఎత్తి అభయం ఇచ్చాడు నిర్మాత. మళ్ళీ కథా ప్రారంభం. చిన్న హీరోకి పెళ్ళయిందని తెలిసి ఇంట్లోని గాజుసామాన్లు, చెక్కసామాన్లు అన్నీ విరగ్గొట్టి బోరున ఏడుస్తుంది సెకండ్ హీరోయిన్. పగతో సమయం కోసం వేచి ఉంటుంది.

చిన్న హీరో, పెద్ద హీరోయిన్ అన్యోన్యంగా కాపురం చేసుకుంటున్నారు. అయినా, ఆవిడ కడుపున ఒక కాయ కూడా కాయక పోవడంతో దిగులుపడుతుంది. అది గమనించి ఒక వ్రతం చెయ్యమని సలహా ఇస్తాడు వాళ్ళ ఇంటి పురోహితుడు. నిష్ఠగా చెయ్యాలని, విఘ్నం వాటిల్లితే అనర్థం అని హెచ్చరిస్తాడు కూడానూ. సరే అని వ్రతం ప్రారంభిస్తుంది.

నూటపదహారు మంది ముత్తైదువులను పిల్చి, వాళ్ళందరికీ పూజలూ, ప్రదక్షిణాలూ చేసి, వాయనా లిచ్చి భోజనాలు పెట్టాలి.

పెద్ద హీరోయిన్ పాట పాడుతూ పూజ చేస్తూ ఉంటే మేడ మీద నుంచి చూస్తూ ఆనందిస్తాడు చిన్న హీరో.

అంతలో పరిగెత్తుకొస్తాడు వంటవాడు" అంటూ ఆపేశాడు రచయిత.

"ఇక్కడ నుంచి టర్న్ తీసుకుంటుంది స్టోరీ. జాగ్రత్తగా వినండి" అన్నాడు.

రిలాక్సింగ్‌గా కూర్చున్న నిర్మాత బిగిసిపోయి నిటారుగా కూర్చున్నాడు.

దర్శకుడు కుర్చీలోంచి నేల మీదకు జారిపోయాడు.

"వంటవాడు వచ్చి, 'అయ్యగారూ, రెండు గేస్ సిలెండర్లూ అయిపోయాయి. వంట ఇంకా సగంలోనే ఉంది' అంటూ పిడుగులాంటి కబురు చెప్పాడు. తడబడి ధైర్యం తెచ్చుకుంటాడు చిన్న హీరో. 'అమ్మగారికి తెలియనివ్వకు. నేను చిటికెలో పట్నం వెళ్ళి సిలెండర్లు తీసుకొస్తా' అని ఖాళీ సిలెండర్లు ఎడ్లబండిలో వేసుకుని బయలు దేరాడు. ఊరు దాటేసరికి దారికి అడ్డంగా రోడ్డు తవ్వేసి ఉంది. బండి ముందుకు వెళ్ళలేదు. బండి దిగి, 'ఎవరీ పని చేసింది' అని అరిచాడు.

'నేనే' అని సమాధానం వచ్చింది. తిరిగి చూస్తే సెకండ్ హీరోయిన్.

'నన్ను గుర్తుపట్టావా? ఆనాడు నీకోసం వెంపర్లాడిన దాన్ని. అందంలో అప్సరసని. ఐశ్వర్యంలో కుబేరుడి కూతుర్లాంటిదాన్ని. అలాంటి నన్ను కాదని అన్నిటా నా కంటే తక్కువదాన్ని, వయసులో మాత్రం నా కంటే ఎక్కువదాన్ని పెళ్ళి చేసుకుని నన్నవమా నించావ్' అంది క్రూరంగా.

'ఇందులో నీకు అవమానం ఏముంది? నాకు నచ్చినదాన్ని పెళ్ళి చేసుకున్నాను. అది నా ఇష్టం' అంటూ తలెగరేశాడు చిన్న హీరో.

'నిజమే. అందుకే నేనీనాడు ఇలా రోడ్డు తవ్వేశాను. ఇది నా ఇష్టం. ఇప్పుడు నువ్వు బస్తీకి వెళ్ళలేవు. సిలెండర్లు తేలేవు. అక్కడ వ్రతం భంగం అవుతుంది. నీ భార్యకు పిచ్చెక్కుతుంది. నీ వంశం సర్వనాశనం అవుతుంది. నా పగ చల్లారుతుంది' అంటూ వికటాట్టహాసం చేసింది.

నిలువెల్లా వణికిపోయాడు హీరో.

'భయపడకు. ఇటు చూడు' అంది సెకండ్ హీరోయిన్. అక్కడ చెట్టు కింద రెండు సిలెండర్లున్నాయి. నువ్వు ఊఁ అంటే ఈ రెండూ నీకిచ్చేస్తాను' అంది ఆదరంగా.

'ఆ పని చెయ్యి. నీకు పుణ్యం ఉంటుంది. నా ఆస్తంతా నీకు రాసిస్తాను' అన్నాడు కడు దీనంగా.

'ఆస్తి నాకెందుకూ? ఈ సిలెండర్లు నీకివ్వాలంటే నువ్వో పని చెయ్యాలి.'

'ఏమిటో చెప్పు.'

వెంటనే చెయ్యి చాచింది.

ఆ చేతికి పసుపుతాడు, దానికి మిలమిల మెరుస్తున్న మంగళసూత్రాలు.

'ఇవి నా మెడలో కట్టు. ఈనాటికీ నీ మీద ప్రేమతో చచ్చిపోతున్నాను. నన్ను పెళ్ళి



చేసుకుంటే ఈ సిలెండర్లిచ్చేస్తాను. మన పెళ్ళి విషయం రహస్యంగా ఉంచుతాను. మూడో మనిషికి తెలియకుండా జాగ్రత్తపడతాను.

ఇక నీ ఇష్టం. నన్ను పెళ్ళి చేసుకుని సుఖంగా ఉంటావో లేక కాదని నువ్వమితంగా ప్రేమించే భార్య నాశనానికి కారకుడవు తావో తేల్చి చెప్పు' అంది.

హీరో కళ్ళప్పగించి చూస్తాడు. ఓ పక్కన ఎర్రని సిలెండర్లు, మరోపక్క పచ్చని పసుపుతాడు. ఓ క్షణం ఆలోచించి, 'సరే, నేనమితంగా ప్రేమించే భార్య కోసం నిన్ను పెళ్ళి చేసుకుం టాను' అంటూ మంగళసూత్రం లాక్కుని కట్టేశాడు. దూరంగా నోములో మంగళ వాద్యాలు మోగాయి."

> "వింటున్న జనమే కాదు, సినిమా చూస్తున్న జనం కూడా గగ్గోలు పెడతారు. ఇదేం కథ. బొత్తిగా వావీవరసలూ ఉండక్కర్లేదా" అంటూ మదన్ ధ్వజమెత్తాడు.

మదన్ బల్ల గుద్ది లేచి నిలబడడంతో అంతరాయం కలిగింది.

"దారుణం సార్. దారుణం. సస్యశ్యామలమైన పల్లెటూరంటున్నారు. మూడు రాళ్ళు పెట్టి నాలుగు కర్రలు పెడితే వంట కాదా. గేస్ సిలెండర్ అత్యవసరం అవడం, దాని కోసం హీరో మళ్ళీ పెళ్ళి చేసుకోవడం. ఓహ్! దారుణం" అన్నాడు ఆవేశంగా.

"ఇలా చీటికీ మాటికీ అడ్డంపడి వేధిస్తుంటే నేనేం చెయ్యలేను సార్." నిస్సహాయంగా చేతులెత్తేశాడు రచయిత.

"ఇందాకట్నించి చూస్తున్నాను. ఏమిటయ్యా నీ గోల. అర్టు ఫిలిమ్ తీద్దామని ఆలోచనలో ఉన్నావా ఏం? అర్టు ఫిలిమ్ తీస్తే మనకు దక్కేది అలమర్లో పెట్టుకోవడానికి ఒక పురస్కారం, అడుక్కోవడానికి ఒక చిప్ప. అటక మీద ఫిలిమ్ డబ్బాలు. డిస్ట్రిబ్యూ టర్లు కూడా అటుంచి టీవీ చానల్ వాళ్ళు కూడా తీసుకోరు. నీకేం తెలుసు" అన్నాడు నిర్మాత.

"ఏదో కుర్రకుంక. అనుభవరాహిత్యం. మీరూరుకోండి" అంటూ నిర్మాతని శాంతపరచి, మదన్ వైపు తిరిగాడు దర్శకుడు.

"చూడబ్బాయ్. ట్రెండ్ అలా ఉంది మరి. మహామహా వాళ్ళే ఇద్దరు హీరోయిన్లని పెట్టి, అదీ చాలక మూడో హీరోయిన్‌ని కూడా ఇరికిస్తుంటే, మనం సహజత్వం, సింగినాదం అంటూ కూర్చుంటే ఎలా చెప్పు? గేస్ సిలెండరు కోసం కాదు, అవసరం అయితే అగ్గిపెట్టె కోసం అయినా మళ్ళీ పెళ్ళి చేసుకోక తప్పదు మరి" అంటూ సర్ది చెప్పాడు.

"అతను చెప్పిందీ పాయింటే. కాబట్టి ఆవేళ జోరున వర్షం పడుతున్నట్లు పిక్చరైజ్ చేద్దాం. ఇక ఎవరూ నోరెత్తే అవకాశం ఉండదు" అంటూ సలహా చెప్పాడు మాటల రచయిత. అందరూ మెచ్చుకోలుగా చూశారతని వంక.

వ్యవహారం సర్దుబాటు కావడంతో కథ మొదలైంది.

"తన మెళ్ళో తాళి కట్టిన భర్త పాదాలకు నమస్కరిస్తుంది సెకండ్ హీరోయిన్.

'రాత్రికి రండి. అన్ని ఏర్పాట్లూ చేసి ఉంచుతాను. ఈ రాత్రికే మన శోభనం' అంటుంది సిగ్గుగా.

సిలెండర్లు తీసుకుని ఇంటికి వెళ్ళాడు చిన్న హీరో. వ్రతం యథావిధిగా పూర్తయింది. భర్త పాదాలకు నమస్కారం చేసింది పెద్ద హీరోయిన్. 'జన్మజన్మలకూ మీరే నా భర్త కావాలి. జన్మజన్మలకూ మీ మనసులో నా ఒక్కర్తికే స్థానం ఉండాలి. అలా అని ఆశీర్వదించండి' అంది ఆనంద భాష్పాలతో.

భార్యను కావలించుకుని కంటికీ మింటికీ ఏకధారగా ఏడ్చాడు హీరో. జరిగింది ఏదో జరిగి పోయింది. తాళి కట్టాను. కానీ, కాపురం చెయ్యను అని సెకండ్ హీరోయిన్‌తో చెప్పాలని ఆవేశంగా అక్కడికి వెళతాడు. తీరా వెళ్ళాక పండు వెన్నెల్లా మల్లెపూలు, తెల్ల చీరతో మెలికలు తిరిగిపోతున్న కొత్త భార్య. ఆ వాతావరణంలో ఆవేశం మర్చిపోతాడు.

అలా ఒకరికి తెలియకుండా మరొకరితో కాపురం సాగిస్తూ ద్రోహం చేస్తున్నందుకు లోలోపలే బాధపడుతూ ఉంటాడు.

ఎన్ని నోములు నోచినా పెద్ద భార్య కడుపున కాయని కాయ చిన్న హీరోయిన్ కడుపున కాసే సూచనలు కనిపిస్తాయి. చిన్న హీరో చాలా ఆనంది స్తాడు. ఈ వార్త పెద్ద భార్యతో ఎలా చెప్పాలా అని బాధపడుతూ ఉంటాడు.

ఈలోగా కూతురి పెళ్ళి, సంసారం, కడుపు గురించి విలన్‌కి తెలుస్తుంది. మండిపడతాడతను. దానికి కారకుడెవడో చెప్పమని ప్రాణాలు తీసి చెప్పించుకున్న తరువాత మళ్ళీ మండిపడి అబార్షన్ చేయించుకోమని బలవంత పెడతాడు.

కూతురు అందుకు అంగీకరించకపోవడంతో వేరే పథకం ఆలోచిస్తాడు. ఓ డాక్టర్‌ని పిలిపించి మారు వేషంలో కూతురి దగ్గరకు పంపిస్తాడు. ఆ తర్వాత కూతుర్ని తీసుకుని ఫారెన్ వెళ్ళిపోవాలని అన్ని ఏర్పాట్లూ చేస్తాడు. ఓ పెద్ద విమానం తెచ్చి, గనుల్లో బంగారం అంతా తవ్వించేసి ఆ విమానంలో ఓ పక్క వేయిస్తాడు. కరెన్సీ, వజ్రవైడూర్యాలూ మరోపక్క వేయిస్తాడు. అబార్షన్ కాగానే కూతుర్ని లాక్కురమ్మని మనుషుల్ని పంపి తాను పైలట్ సీట్లో సిద్ధంగా కూర్చుంటాడు. చివరి క్షణంలో తండ్రి కుట్ర కనిపెట్టిన సెకండ్ హీరోయిన్ చిన్న హీరోకి కబురు పెట్టి పారిపోతుంది. తనని వెంబడిస్తున్న మనుషుల్ని తప్పించుకుంటూ పరిగెట్టి, ఓ కొండ అంచుకి వెళ్ళి కాలు జారుతుంది. వెంటపడిన మనుషులు చచ్చిపోయిందని నిర్ణయించుకుని ఆ వార్త విలన్‌కి తెలియజేస్తారు.

కూతురెలాగూ పోయింది కాబట్టి ఓ ఏడుపు ఏడ్చి విమానం స్టార్ట్ చేస్తాడు విలన్.

కొబ్బరి చెట్టెక్కి కాయలు దింపుతున్న చిన్న హీరోకి చిన్న భార్య పంపిన కబురు అందుతుంది. ఆదరాబాదరాగా చెట్టు సగం దిగేసరికి విమానం శబ్దం వినిపించడంతో మళ్ళీ పైకెగబాకి కొబ్బరి కాయలతో విమానాన్ని కొట్టడం ప్రారంబిస్తాడు. అవి కాస్తా గురి తప్పుతాయి. అవతల విమానం వెళ్ళిపోతుంది.

'ఓ కొబ్బరికాయా, నువ్వు పుట్టిన ఈ మట్టిలో పుట్టిన బంగారం మన దేశం దాటిపోతోంది. నీ తోబుట్టువు లాటి ఆ బంగారాన్ని కాపాడుకునే బాధ్యత నీదే' అని కొబ్బరికాయకి తెలియజెప్పి గురిచూసి విసురుతాడు.

ఆ కొబ్బరికాయ వెళ్ళి విమానం ఫ్యూయల్ టేంకుకి తగుల్తుంది. పెద్ద విస్ఫోటం. దడాల్న శబ్దం. ఎర్రని మంటలు, నల్లని పొగ."

ఆవేశంతో చెప్పేసి, ఆయాసపడుతూ ఆగేడు రచయిత.

"అబ్బ వింటుంటేనే ఇంత బాగుంది. చూస్తుంటే ఒళ్ళు జలదరించదూ. ఈ సీన్ మాత్రం చాలా బాగా రావాలి" అన్నాడు నిర్మాత ఉద్వేగంతో.

ఈసారి దర్శకుడు అభయహస్తం చూపించాడు.

"ఇదే కెమాక్సా?" ప్రశ్నించాడు మాటల రచయిత.

చెయ్యెత్తి గాల్లో చిటికె వేశాడు రచయిత. "అలా అయితే పాత కథే. కొత్తదనం ఏముంది" అంటూ మొదలు పెట్టాడు.

"శత్రు సంహారం చేసి చిన్న భార్యను రక్షించడానికి వస్తాడు చిన్న హీరో. అప్పటివరకూ చెట్టు కొమ్మని పట్టుకుని వేలాడుతున్న సెకండ్ హీరోయిన్ భర్తని చూసి, తాను చెప్పాలనుకున్న నాలుగు మాటలూ చెప్పి చెయ్యి జారి కింద భయంకరంగా ప్రవహిస్తున్న జలపాతంలో పడి కొట్టుకుపోతుంది.

తన చిన్న భార్య వంశాంకురంతో గంగపాలై పోయేసరికి కుంగిపోతాడు చిన్న హీరో. గడ్డం పెంచేసుకుని మంచం పడతాడు. వంశాంకురం, నా వంశాంకురం అని కలవరిస్తాడు.

అసలు విషయం తెలియని పెద్ద హీరోయిన్ అతగాడు పిల్లల కోసం బెంగపడుతున్నాడని మరింత ముమ్మరంగా పూజలవీ చేస్తుంటుంది.

ఇక్కడ ఇలా ఉండగా, అక్కడ అమెరికాలో నయాగరా ఒడ్డున స్నానం చేస్తున్నారు పెద్ద హీరో, చిన్న హీరోయిన్.

సరసాలాడుకుంటూ, జలకాలాడుతుండగా ఓ శరీరం కొట్టుకొచ్చి వీళ్ళకి తగుల్తుంది.

కెవ్వున అరిచి బయటికి లాక్కొస్తారు.

ఆవిడని గుర్తిస్తుంది చిన్న హీరోయిన్.

బద్ధశత్రువు కూతురే కానీ, సాటి భారతీయురాలు, పైగా నిండు గర్భిణి. కాబట్టి శత్రుత్వం మరచి సెకండ్ హీరోయిన్‌ను కార్లో ఇంటికి తీసుకెళతారు."

చెపుతున్న రచయిత మదన్ వంక చూసి ఠక్కున ఆగి పోయాడు. మదన్ పిచ్చి చూపులు చూస్తూ తనలో తానే నవ్వు

> కథ వింటున్న డైలాగ్ రైటర్ మాంచి డైలాగులు రాయడానికి బోలెడంత స్కోపు ఉందని ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ మురిసిపోయాడు.



కుంటున్నాడు. అందరి దృష్టీ అటే మళ్ళింది.

వెంటనే లేచి అతని భుజం తట్టాడు దర్శకుడు. "ఇలా ప్రతీదానికీ రంధ్రాన్వేషణ చేసి మనసు పాడు చేసుకుంటే నువ్వేం పైకొస్తావురా? అయినా, అంత మతి పోగొట్టుకోవాల్సింది ఏముంది చెప్పు. ఇప్పుడేం అసహజం జరిగిందని? జలపాతం నుంచి నదిలోకి ప్రవహిస్తుంది నీరు. నది నుండి సముద్రంలో కలుస్తుంది. సముద్రం మరో సముద్రంలో. ఆ సముద్రం నీరు నదికీ, ఆ నది నీరు జలపాతానికీను. నీరు అంతా ఒక్కటే. అంత దూరం ప్రయాణం చేసింది కాబట్టే ఇక్కడ లేత నెలల్లో ఉన్న పిల్ల అక్కడికి నిండు గర్భిణిగా చేరింది. ఇలా సమన్వయించుకోవాలి" అంటూ బోధించి, "మీరు కానివ్వండి" అన్నాడు రచయితతో.

రచయిత భయంభయంగా మదన్ వంక చూసి మళ్ళీ కథ మొదలు పెట్టాడు.

"సెకండ్ హీరోయిన్‌కి నొప్పు లొస్తాయి. పండంటి కొడుకు పుడతాడు. వాడి జన్మ రహస్యాన్ని తెలియజేసి, 'ఇదుగో మీ వంశాంకురం. వీడిని వీడి తండ్రి దగ్గరికి జేర్చండి. నాకీ ఉపకారం చేస్తే మళ్ళీ నీ ఇంట పాపనై పుడతాను' అని చెప్పి కన్ను మూస్తుంది.

ఆ బిడ్డని తీసుకుని ఇండియా వస్తారు పెద్ద హీరో, చిన్న హీరోయిన్.

చిన్న హీరో పరిస్థితి బాగా విషమించింది. వంశాంకురం, వంశాంకురం అని కలవరిస్తుంటాడు. డాక్టర్ ఇక లాభం లేదని చెప్పేస్తాడు. పెద్ద హీరోయిన్ అతని తల దగ్గర కూర్చుని ఏడుస్తూ ఉంటుంది.

అంతలో పరుగుపరుగున వస్తాడు పెద్ద హీరో. పసివాడిని కొడుకు పక్కలో పడుకోబెట్టి, వంగి కొడుకు చెవులో రహస్యం చెప్తాడు. చివాల్న లేచి కూర్చుంటాడు చిన్న హీరో. తన వంశాంకురాన్ని ముద్దుల్తో ముంచెత్తుతాడు. 'ఇక ఈ నిజం దాచలేను. ఆ త్యాగమయికి అన్యాయం చెయ్యలేను' అంటూ భార్యతో నిజం చెప్పేస్తాడు. తన నోము కోసం అంత త్యాగం చేసిన భర్తని చూసి, తన కడుపున కాయ కాయకపోయినా, భర్తకు వంశాంకురాన్ని అందించి అసువులు బాసిన సవితిని తలుచుకుని కృతజ్ఞతతో కుళ్ళికుళ్ళి ఏడుస్తుంది పెద్ద హీరోయిన్. ఆ బిడ్డని అందుకుని గుండెకు హత్తుకుంటుంది" అంటూ కథలో లీనమైన రచయిత కళ్ళొత్తుకున్నాడు.

వింటున్నవారంతా కూడా కళ్ళొత్తుకున్నారు.

"ఆఖరి సీన్‌లో అంతా పట్టు వస్త్రాలు ధరించి, పిల్లాడిని ఎత్తుకుని సెకండ్ హీరోయిన్ సమాధి దగ్గరకు వెళ్ళి భక్తితో మొక్కుతారు."

"కథ బాగుంది. పటిష్టమైన మలుపులున్నాయి. కొత్తదనం ఉంది. జలగలు పీకడం, నోములూ, ముగ్గులూ, కొబ్బరికాయలూ వగైరా నేటివిటీ కూడా ఉంది. ఇది ఓకే చేద్దామా" అన్నాడు దర్శకుడు.

"మీరు ఓకే అంటే ఓకే" అన్నాడు నిర్మాత అన్వేషణ ఫలించినందుకు అమిత ఆనందపడుతూ.

కథ ఖాయం అయింది.

'మరి పేరేం పెడదాం' అని చర్చ ప్రారంభమైంది.

"మనకు ఆరక్షరాలు పేరు బాగా అచ్చివచ్చింది. ఆరు అక్షరాలతో మంచి పేరు ఆలోచించండి" అన్నాడు నిర్మాత.

"వంశాంకురం, కొబ్బరికాయలు, స్వదేశం విదేశం, ఆ జంట ఈ జంట, త్యాగాలే త్యాగాలు..." అంటూ రకరకాల పేర్లు సూచించారు కానీ, అంతగా నచ్చలేదు.

"ఏమిట్రా మదన్, నువ్వేం మాట్లాడవేం. ట్రెండ్‌కి తగ్గట్లు మాంచి టైటిల్ సూచించరా. అదిరిపోయేలా ఉండాలి" అన్నాడు దర్శకుడు.

అప్పటిదాకా నోరు మూసుకుని కూర్చున్న మదన్ నోరు విప్పాడు.

"చూడక చస్తారా? ఈ పేరెలా ఉంది" అన్నాడు. "భేష్! బాగుంది. హిట్ టైటిల్" అంటూ మెచ్చుకుని ఏకగ్రీవంగా ఆమోదించారు.

చూడక చస్తారా? పేరు మీద సినిమా తీయడానికి నిర్ణయం జరిగింది.

'శుభం భూయాత్!' ■